క్లుప్తంగా

నేడు ఇసుక వేలం

దేవరుప్పుల : సీజ్ చేసి నిల్వ చేసిన ఆరు ట్రిప్పుల ఇసుకను నేడు (సోమవారం) తహసీల్దార్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆదేపు అండాళు తెలిపారు. గత నెల 27వ తేదీన ఇసుక వేలం వేయగా వేలంలో పాల్గొన్న వ్యక్తి నిర్దేశిత సమయంలో రుసుము చెల్లించనందున తిరిగి వేలం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆరు ట్రాక్టర్ల ఇసుక వేలం పాటలో పాల్గొనేందుకై ఆసక్తి కలిగిన వారు ముందుగా రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలని ఆమె సూచించారు.

నియోజకవర్గ ప్రజలకు అమ్మవారి దీవెనలు ఉండాలి

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామ : జనగామ నియోజకవర్గ ప్రజలు గ్రామదేవతల దీవెనలతో ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని కోరుతూ ప్రజలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదివారం బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శివసత్తుల ఆటలు, పోతరాజుల విన్యాసాలతో తెలంగాణ సంస్కృతీ , సాంప్రదాయం ఉట్టిపడేలా ప్రతి ఒక్కరు జరుపుకునే పండుగ బోనాల జాతర అన్నారు.

అన్నదానం

జనగామ రూరల్ : పట్టణానికి చెందిన ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పి.మధు పుట్టినరోజు సందర్భంగా అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని శామీర్‌పేట్‌లో గల రుద్రమాదేవి వృద్ధాశ్రమంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, రుద్రమాదేవి వృద్ధాశ్రమం నిర్వాహకులు దేవేందర్, లక్ష్మణ్, ఉస్మాన్, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలం



జనగామ: ప్రకృతిలో అరుదుగా లభించే పుష్పాల్లో బ్రహ్మ కమలం ఒకటి. హిమాలయ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే ఈ పువ్వు రాత్రివేళ మాత్రమే వికసించి, తెల్లటి కాంతివంతమైన రూపంతో కళ్లకు ఆనందాన్ని కలిగిస్తుంది. పురాణాల ప్రకారం ఈ పుష్పాన్ని దేవతలకు అత్యంత ప్రీతిపాత్రమైనదిగా భావిస్తారు. ఏడాదికి ఒక్కసారే పూసే ఈ పువ్వు, ఇంట్లో వికసిస్తే శుభసూచకంగా భావిస్తారు. పర్వత ప్రాంత ప్రజలు దీనిని ఔషధ గుణాలతో కూడిన మొక్కగా ఉపయోగిస్తారు. ఆధ్యాత్మిక, ఔషధ, అలంకారపరంగా ప్రత్యేకమైన స్థానం కలిగిన ఈ పువ్వు జిల్లా కేంద్రం రైల్వేస్టేషన్ ఏరియా పన్నీరు మోహన్ స్వగృహం ఆవరణలో ఆదివారం రాత్రి వికసించింది. దీంతో కుటుంబ సభ్యులతో పాటు వార్డులోని మహిళలు, ప్రజలు పవిత్రమైన చెట్టు వద్దకు చేరుకుని పూజలు చేసి దర్శనం చేసుకున్నారు.

ఉమకు గోల్డ్‌మెడల్



దేవరుప్పుల : మండలంలోని నీర్మాల గ్రామానికి చెందిన చింతల రవీందర్‌రెడ్డి–రజిత కుమార్తె ఉమ బీటెక్ ఈసీఈలో గోల్డ్ మెడల్ సాధించింది. శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఘట్‌కేసర్‌లో బీటెక్ చదివిన ఆమె ఈసీఈ బ్రాంచ్‌లో గోల్డ్ మెడల్ సాధించింది.

సన్మానం



బచ్చన్నపేట : మండలంలోని పలు శాఖలకు చెందిన ఉత్తమ అధికారులకు ఆదివారం పలువురు సన్మానించారు. కానిస్టేబుళ్లు భానుచందర్, అఖిల, పంచాయతీ కార్యదర్శి రూపా చైతన్య, రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ పల్లపు రామకృష్ణను ఆయా గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడానికి ఆయా గ్రామ ప్రజల సహకారమేనని అన్నారు. దీంతో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

గడ్డిమందు పిచికారీ



జనగామ : జనగామ పట్టణంలోని నెహ్రూ పార్కు, సాయినగర్ ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఏపుగా పెరిగిన గడ్డి నివారణకు ఆదివారం ఏఎల్ఎం రమేష్ గడ్డి మందు పిచికారీ చేశారు. ఫ్యూజ్ పోయిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గడ్డి తొలగించేందుకు మందు దోహదపడుతుందని ఏఈ సౌమ్య అన్నారు. లైన్‌మెన్ ప్రసాదరావు ఉన్నారు.

కుంట కాదు.. మురుగు నీరు

అధ్వానంగా 15,16వ వార్డులు
- సైడ్ కాల్వలు లేక ఇళ్ల ఎదుట నిలుస్తున్న మురుగునీరు
- వర్షం పడితే అంతేసంగతులు



15వ వార్డులో కుంటను తలపిస్తున్న మురుగునీరు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గల 15, 16వ వార్డుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. పేరుకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం, ఎమ్మెల్యే, ఎంపీలు ఎస్సీలు అయినప్పటికీ దళిత కాలనీలో సమస్యలు అలాగే తిష్టవేశాయి. ఘన్‌పూర్ పట్టణంలోని దిగువ ప్రాంతాల్లో ఉన్న 15, 16వ వార్డుల్లో డ్రెయినేజీల సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో ఏళ్ల తరబడి కాలనీవాసులు దుర్గంధంతో పాట్లు పడుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా, ఇటీవల స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినా సమస్యలు మాత్రం తప్పడం లేదు.

ఇళ్లలోకి చేరుతున్న మురుగు నీరు..

స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపల్‌కి 16 వార్డులు ఉండగా దళితకాలనీలోకి 15, 16వ వార్డులు దిగువ ప్రాంతంలో ఉంటాయి. సదరు కాలనీలో డ్రెయినేజీలు సరిగ్గా లేక మురుగునీరంతా ఆ కాలనీల్లోని ఇళ్ల ఎదుట నిలుస్తోంది. వర్షం కురిసిందంటే డ్రెయినేజీలు, వర్షపునీరు కలిసి ఇళ్లలోకి వచ్చి చేరుతోంది. జనవాసాల్లో మురుగునీరు నిలుస్తుండడంతో దోమలు, పందులకు నిలయంగా మారుతోంది. కాలనీలో పలువురు విష జ్వరాలకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. తేలిక పాటి వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే భారీ వర్షాలు కురిస్తే అంతేసంగతులు. 15, 16వ వార్డుల దుస్థితిపై గతంలో కాలనీవాసులు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

జఫర్‌గఢ్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ మండల జాయింట్ సెక్రటరీ పులి ధనుంజయగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయడం లేదన్నారు. రుణమాఫీ విషయంలో రైతులను మోసం చేశారన్నారు. ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నాయిని నరేష్, రాజిరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్ : భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న (మంగళవారం) స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి మూలంగా భూ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వీటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా భూ భారతి చట్టాన్ని తీసుకు వచ్చిందని చెప్పారు. భూ సమస్యల పరిష్కారానికి అనేక మంది రైతులు భూభారతిలో దరఖాస్తులు చేసుకున్నట్లు వివరించారు. దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు వీటి పరిష్కారానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు చొరవ చూపడం లేదని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. రేపటిధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, నాయకులు సుధాకర్, వడ్లకొండ సుధాకర్, గం గరాజు, శంషోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి'



నూతన కమిటీతో ప్రమోద్‌కుమార్ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్ : ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య మహాసభ జనగామ జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి ప్రమోద్‌కుమార్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆర్యవైశ్య మహాసభ మండల నూతన కమిటీ, ఆర్యవైశ్య యువజన సంఘం, ఘన్‌పూర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల మాజీ అధ్యక్షుడు నాగబండి వెంకట్రామనర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు ముందుగా నూతన కమిటీలచే ప్రమాణ స్వీకారం చేయించారు. స్టేషన్‌ఘన్‌పూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఆకుల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా నాగబండి సంతోష్, కోశాధికారిగా రేవూరి శ్రీనివాస్, పీఆర్‌ఓగా తమ్మి సత్యనారాయణ, ఆర్యవైశ్య మహాసభ మండల యూత్ అధ్యక్షుడిగా పాలకుర్తి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గన్ను మహేష్, కోశాధికారిగా జొన్నల విష్ణు, ఉపాధ్యక్షుడు పోకల చందర్, ఘన్‌పూర్ పట్టణ అధ్యక్షుడిగా నూక సందీప్, ప్రధాన కార్యదర్శి దేవ రవి, కోశాధికారి అయిత శివరాం, ఉపాధ్యక్షుడిగా పల్లెర్ల రంజిత్‌తో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. జొన్నల రాజేశ్వరరావు, బెలిదె వెంకన్న, పార్శి కమల్‌కుమార్, గన్ను నర్సింహులు, భిక్షపతి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ వరూధిని, అనూజ, స్రవంతితోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



చిల్పూరు : స్టేషన్‌ఘన్‌పూర్‌లోని జాతీయ రహదారి నుంచి పల్లగుట్ట గ్రామానికి వెళ్లే రోడ్డులో లోలెవల్ కల్వర్టు ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలతో కల్వర్టు గుంతలమయంగా మారింది. అలాగే రోడ్డు పక్కనే పాత వ్యవసాయ బావి ఉంది. అటువైపు కొత్తగా వాహనదారులు ఎవరైనా వస్తూ పక్కకు దిగితే బావిలో పడే ప్రమాదం ఉంది. ప్రతీ రోజు అధికారులు ప్రయాణిస్తున్న అక్కడ కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రమాదాలు జరగక ముందే అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్ అధికారులను డిమాండ్ చేశారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



యువకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నవీన్‌కుమార్

చిల్పూరు : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ సూచించారు. చిన్నపెండ్యాల గ్రామంలో యువతతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎస్సై మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, మద్యపానం తదితర అలవాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. అపరిచిత వ్యక్తులు, సీబీఐ అధికారులు, జడ్జిలు, పోలీసులమంటూ వచ్చే ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని అలాంటివి వచ్చినపుడు అనుమానం ఉంటే వచ్చిన నంబర్‌ను తమకు పంపాలని అన్నారు. వాహనదారులు వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇంద్రాచారి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ ఫలాలు అందించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఉద్యమకారులు

జనగామ రూరల్ : తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చి, సంక్షేమ ఫలాలు అందించాలని తెలంగాణ ఉద్యమకారుడు గండి నాగరాజు అన్నారు. ఆదివారం పట్టణంలోని సంజయ్ నగర్‌లోని స్థానిక భగత్‌సింగ్ చౌక్ వద్ద ఉన్న కమ్యూనిటీ హాల్‌లో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ కోసం విలువైన సమయాన్ని కేటాయించి ఉద్యమాల్లో పాల్గొని ప్రాణాలు సైతం కోల్పోయిన అమరుల కుటుంబాలను, ఉద్యమ కారులను పాలక పక్షాలు గుర్తించాలని కోరారు. ఉద్యమ సమయంలో లాఠీదెబ్బలు, కేసులను లెక్క చేయకుండా పోరాడి, కోర్టుల చుట్టూ తిరుగుతున్న ఉద్యమకారులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న 250 గజాల స్థలం, ఉద్యమకారుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగం , గుర్తింపు కార్డులను, బస్సు, రైల్వే పాసులను, ఉద్యమకారుల కుటుంబాలకు రూ.25వేల పింఛన్ ప్రకటించాలన్నారు. ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రూ.పదివేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు వంగ భీమ్‌రాజ్, మంతెన మణికుమార్, బైరు బాబు, కృష్ణ, కరాటే సలీం, జగదీష్, శివకృష్ణ, ముక్క స్వామి, అనంతుల ఆంజనేయులు, నర్సింహులు, సాయి, పిడుగు ఆశీర్వాదం, కొయ్యడ శ్రీనివాస్, మాటూరి భరత్, ముక్క వెంకటయ్య, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం



ఇబ్రహీంపూర్‌లో పరిశీలిస్తున్న జగదీష్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి : గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్, ఫతేషాపూర్ గ్రామాలకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీసీ రోడ్లు మంజూరు చేయగా, వాటి నిర్మాణాలు చేపట్టనున్న ఎస్సీ కాలనీలను ఆయన ఆదివారం గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీష్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రేపు సీసీ రోడ్ల పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రెండు గ్రామాల్లోని సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టం భాస్కర్‌రెడ్డి, ఎండీ హయతలి, సత్యనారాయణ, షబ్బీర్‌మియా, గాజులపాటి వీరోజి, పోకల శ్రీనివాస్, చింత నరేష్, గ్యార నాగరాజు, మేడిపల్లి నరేష్, చింత యాదగిరి, దొరగొల్ల గట్టయ్య, చింత హరీష్, జోగు శ్రీధర్, పండుగ నరేష్ , పెండల తిరుపతి, శ్యాంసుందర్, హింగె మోహన్, మల్లేష్, సిద్దులు తదితరులు పాల్గొన్నారు.



జనగామ: బోనాలతో వెళ్తున్న మహిళలు



లింగాలఘణపురం: బోనాలతో వెళ్తున్న మహిళలు



స్టేషన్‌ఘన్‌పూర్: ఇప్పగూడెంలో..

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

శ్రావణమాసం నాలుగో ఆదివారం సందర్భంగా జనగామ పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోచమ్మ బోనాల పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా పోచమ్మతల్లి ఆలయానికి వచ్చి బోనాలు నైవేద్యాలు సమర్పించారు. పోచమ్మ దేవాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



బచ్చన్నపేట: బోనాలతో వెళ్తున్న మహిళలు



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి పోచమ్మగుడి వద్ద..





చిల్పూరు: బోనంతో నష్కల్ మాజీ సర్పంచ్ స్వప్న బోనాలతో చిన్నారులు



జనగామ: ఉప్పలమ్మ ఆలయంలో పూజలు

బీఆర్ఎస్‌లో చేరిక



మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు

పాలకుర్తి : మండలంలోని మంచుప్పల గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ నాయకుడు గ్యార సారంగం ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మగాని కొమురయ్య, ఇటికాల దిలీప్, గార్య సంతోష్, ప్రేమ్‌కుమార్, సాయి, గణేష్, మాచర్ల భాస్కర్, మహేష్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, దివ్యాంగులు

స్టేషన్‌ఘన్‌పూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులు, చేయూత పింఛన్‌దారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జ్ బోడ సునీల్ కోరారు. మండలంలోని మీదికొండ గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పింఛన్‌దారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేలు, వృద్ధులు, వితంతువుల చేయూత పింఛన్‌ను రూ.2,016 నుంచి రూ.4వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులను, చేయూత పెన్షన్‌దారులను దగా చేస్తూ మభ్యపెడుతున్నారని, తక్షణమే పింఛన్లను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుర్రం నవీన్, నాయకులు బొట్ల మహేష్, నలిమెల నాగరాజు, గాదె శ్రీధర్, లింగం, రాజు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణుడి ప్రతిమ ఊరేగింపు



జనగామ రూరల్ : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందుజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలో శ్రీ కృష్ణ భగవానుడి ప్రతిమను ఆదివారం ఊరేగించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణం ధర్మకంచ మినీ స్టేడియం నుంచి చమన్ కాలనీ, గుండ్లగడ్డ కాలనీ వీధుల్లో ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. నిర్వాహకులు పాలమాకుల లక్ష్మీకృష్ణ, దేవేందర్, పంచాక్షారీ, శ్రీ నాథ్, ఉపేందర్, లింగస్వామి, రామరాజు, బుచ్చి బాబు, శంకర్, సాయిరాజు, లత, రాజేశ్వరి, నాగలక్ష్మి, లావణ్య, కవిత, ర మాదేవి, జనగామ, భువనగిరి, చేర్యాల, తొర్రూరు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



పాలకుర్తి టౌన్: శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం రాత్రి గుడివాడ చౌరస్తా పంచగుళ్ల వద్ద యాదవ కులస్తులు స్తంభం జారుడు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నుంచి స్వామివారి ఉత్సవ మూర్తులతో రథోత్సవం డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా పంచగుళ్ల వరకు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం చేపట్టారు. ఎస్సై లింగారెడ్డి, ఆలయ సిబ్బంది, యాదవ పెద్దగొల్ల సత్యేంద్ర సోమన్న, సంఘం కుల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి రక్షించాలి



జనగామ రూరల్ : జనగామ రెండో వార్డులోని సాయి రెసిడెన్సీలో పంతం సాయిప్రసాద్ ఆధ్వర్యంలో గోగ్రీన్ జనగామ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పచ్చదనానికి 10వేల మొక్కలు నాటే పథకం రూపొందించామని తెలిపారు. జనగామ చుట్టుపక్కల విరివిగా మొక్కలు నాటడం, వాతావరణ మార్పుల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ తరాలకు శాశ్వతమైన ఆకుపచ్చ పాదముద్రను సృష్టించడం తమలక్ష్యం అన్నారు. ప్రకృతిని పునరుద్ధరించడానికి, గాలి నాణ్యతను మెరుగుపరచడానికి పర్యావరణ సమతుల్యతను తిరిగి తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నామన్నారు. వ్యక్తులు, సంఘాలు, సంస్థలు కృషి చేసి హరిత పట్టణంగా మార్చాలని కోరారు. పంతం వసంత లక్ష్మి, సిద్ధార్థ, సాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.